క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు అప్పాజీ తదితరులు కల్యాణం నిర్వహించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



రావాడ ప్రజలతో ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఉన్నతాధికారులు

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు ప్రాధాన్యం ఇవ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్టీపీసీ ఆధ్వర్యంలో శుక్రవారం రావాడలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధుల ముప్పు తప్పుందన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతను సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ రుమాడీశర్మ, ఏజీఎం కేవీ ప్రసాద్, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, రావాడ సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, సీఎస్సార్ విభాగం ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

9 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి స్థూలకాయ నివారణకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 99854 56160, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలి. తరగతులు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

రోల్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపిక రేపు

మురళీనగర్: రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఈ నెల 8న రోల్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తోట లలిత ప్రియ, కోచ్ సంతోష్ కుమార్ తెలిపారు. అండర్-14,17, అండర్-19 విభాగాల్లో రోల్ బాల్ సెలక్షన్ ట్రైల్స్ నిర్వహిస్తామని, అర్హత కలిగిన క్రీడాకారులు ఆ రోజు ఉదయం 8గంటలకు వైశాఖి స్పోర్ట్స్ పార్కు స్కేటింగ్ రింక్ వద్ద హాజరు కావాలని కోరారు. వివరాలకు 9912108425లో సంప్రదించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. అండర్-14 బాలురు, బాలికల విభాగాల పోటీలు, ఎంపికలు పరవాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని ఇండోర్ స్టేడియంలో, అండర్ 17 బాలురు బాలికల పోటీలు, ఎంపికలు బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.

10న యోగా పోటీలు

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ స్థాయి యోగా పోటీలు, ఎంపికలు ఈ నెల 10వ తేదీన పరవాడ మండలం ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు మండల కో-ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. బాలురు, బాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జట్ల ఎంపిక చేపడతామని తెలియజేశారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్సాహంగా గడప గడపకు..

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు.

సమస్యలపై ఆరా

ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో మురుగునీటి కాలువలు నిర్మించాలని, కాలువల్లో బ్లీచింగ్ పిచికారీ చేయించాలని ప్రజలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఎన్ని ఆరాచకాలు సృష్టించారో ప్రజలు ఇప్పటికీ మరవలేదన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. గత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసిన చింతకాయల సూకరత్నం కుటుంబానికి జగనన్న ప్రభుత్వం రూ.2.4 లక్షల లబ్ధి చేకూర్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సర్పంచ్‌లు చింతకాయల సుజాతముత్యాలు, చేపల మసేను, ముత్యాలమ్మపాలెం సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, అధికారులు గండి రామారావు, ఎం.ఎస్.ఎస్.రెడ్డి, షన్ముఖ, శేషసాయి, కె.రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



దిబ్బపాలెంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

నేడు నాయుడుపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు

నాయుడుపాలెం గ్రామంలో శనివారం ఉదయం 8 గంటలకు జగనన్నే మా భవిషత్ సంక్షేమ యాత్ర నిర్వహించనున్నామని సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని వెంకటపతిపాలెం నుంచి నాయుడుపాలెం వరకు పాదయాత్ర నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్ష



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షణగా నిలుస్తుందని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు అన్నారు. పెదముషిడివాడలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం కల్పించిన ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిఅన్నారు. పేద వర్గాలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరంలాంటిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని ఎంపీపీ వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు కోరారు. శిబిరంలో పాల్గొన్న 352 మందికి వైద్య నిపుణులు కనకఅప్పారావు, వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, నాయకులు సతిబాబు, యలమర్తి బుజ్జి, నందవరపు శ్రీను, ఒమ్మి అర్జున్, నారపిన్ని శ్రీను, అరుణ్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ఆకట్టుకుంది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



సుప్ర వెహికల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ సూచించారు. పెందుర్తి మండలం అక్కిరెడ్డి పాలెం, సరిపల్లి గ్రామాల్లో శుక్రవారం సుప్ర వెహికల్ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగావాన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు ఏవిధంగా జరుగుతాయో సీసీ కెమెరాల ద్వారా రికార్డు అయిన పలు సంఘటనలను స్క్రీన్‌పై చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్డు క్రాస్ చేసేటప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం విడనాడాలని పిలుపునిచ్చారు.

కన్స్యూమర్ క్లబ్ ప్రారంభం

సబ్బవరం: వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులు విధిగా తెలుసుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌ఎస్ రామకృష్ణ అన్నారు. మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కన్స్యూమర్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. నగదు చెల్లించి పొందే వస్తువులు,సేవల ద్వారా వచ్చే వినియోగదారుల హక్కులు తెలుసుకుని మోసాలను అరికట్టే విధంగా విద్యార్థులు అవగాహన పొందాలని సూచించారు. స్కూల్ కన్స్యూమర్ క్లబ్ గైడ్‌గా ఉన్న ఉపాధ్యాయులు జి. ముత్యాలనాయుడు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ శ్వరరావు, సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం, ఉపాధ్యాయురాలు ఎస్. సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల రక్షణ చట్టం పుస్తకం ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎస్ రామకృష్ణ తదితరులు

నగరంలో కార్డన్ సెర్చ్

సరైన ధ్రువపత్రాలు లేని 31 బైక్‌లు సీజ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

దొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు జామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

విశాఖ-శ్రీకాకుళం రోడ్ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం విశాఖపట్నం-శ్రీకాకుళం రోడ్ సెక్షన్‌లో విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్, రైల్వేకాలనీ, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 3వ లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం దూసి రైల్వేస్టేషన్, దాని పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుదీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహరాణా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(ఈస్ట్) ఎం.వి.రమణ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎం.ఎస్.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా శుక్రవారం పలు రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా విశాఖపట్నానికి శనివారం చేరుకోవాల్సిన రైళ్లు అంతే ఆలస్యంగా రానున్నాయి.

- హౌరాలో శుక్రవారం ఉదయం 8.35 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12.35 గంటలకు బయలుదేరింది.
- శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో శుక్రవారం ఉదయం 7.55 గంటలకు బయలుదేరాల్సిన శ్రీ సత్యసాయిన ప్రశాంతి నిలయం-హౌరా (22832) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది.
- పురూలియాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సిన పురూలియా-విల్లుపురం (22605) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరింది.
- హౌరాలో శుక్రవారం సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-మైసూరు(22817) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యరాత్రి 12.30 గంటలకు బయలుదేరింది.
- పూరిలో శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరాల్సిన పూరి-యశ్వంత్‌పూర్ (22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరింది.
- పూరిలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరాల్సిన పూరి-అహ్మదాబాద్ (12843) ఎక్స్‌ప్రెస్ రాత్రి 9 గంటలకు బయలుదేరింది.

రిమాండ్ ఖైదీ మృతిపై 12న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ రొంపల్లి రామకృష్ణ మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తవలసకు చెందిన రాంపల్లి రామకృష్ణ రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఆయన మృతి చెందాడు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. భీమిలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విచారణ చేపడుతున్నామని.. రామకృష్ణ మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు.

ఐరన్ ఓర్ సరఫరాకు చర్యలు చేపట్టాలని వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ఐరన్ ఓర్ సరఫరాకు సత్వర చర్యలు తీసుకోవాలని స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్ర నాథ్ సిన్హాను కోరారు. శుక్రవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర కార్యదర్శి, సెయిల్ చైర్మన్‌లను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న ఐరన్ ఓర్ కొరత దృష్ట్యా నిరంతర సరఫరా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తాము, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశామన్నారు. రోజుకు 6 నుంచి 7 ర్యాకులు సరఫరా జరగాల్సి ఉండగా, రెండు నెలలుగా ఎన్ఎండీసీ సరిగ్గా సరఫరా చేయడం లేదన్నారు. దీంతో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు బదులు రెండు ఫర్నేస్‌లు మాత్రమే నడపాల్సి వస్తుందని తెలిపారు. గంగవరం పోర్టులో ఉన్న ఎన్ఎండీసీ, సెయిల్‌కు చెందిన ఐరన్ ఓర్‌ను స్టీల్‌ప్లాంట్‌కు మరల్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.



సెయిల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదినారాయణ

విద్యతోనే ఉన్నతి

ఏయూ క్యాంపస్: విద్య.. వ్యక్తి అభ్యున్నతికి, కుటుంబ స్థితిగతులను మార్చడానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని మారిషస్‌లో స్థిరపడిన భారతీయుడు దేవ దాలయ్య అన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖ నుంచి మారిషస్‌కు వలస వెళ్లిన తమ పూర్వీకుల సంగ్రహ జీవిత ప్రస్థానాన్ని వివరిస్తూ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవ్ దాలయ్య మాట్లాడుతూ 1865లో తమ పూర్వీకులు విశాఖ నుంచి మారిషస్‌కి ఓడలో వలస వెళ్లిన విధానం.. అక్కడ స్థిరపడి అభివృద్ధి సాధించిన పరిస్థితులను వివరించారు. నేడు తమ కుటుంబ సభ్యులు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో స్థిరపడి పలు రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. దీనంతటికీ ప్రధాన కారణం విద్య అని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో దాలయ్య కుటుంబ సభ్యుడు రాజన్న దాలయ్య, పుస్తక సహ రచయిత ప్రదీప్ సేన్, ఏయూ జర్నలిజం విభాగ ఆచార్యుడు డి.వి.ఆర్.మూర్తి, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఈ.ఎన్.ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్యులు, దాలయ్య కుటుంబ సభ్యులు

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

సీఐ రంగనాథం

సబ్బవరం: సహ విద్యార్థులతో కలిసిమెలిసి ఉంటూ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ రంగనాథం సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ వల్ల అనర్థాలు,సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు విద్యా సంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దిశ యాప్ వినియోగంతో పాటు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి,ఎస్ఐ ఎల్. సురేష్, అధ్యాపకులు డాక్టర్ వి. నివేదిత, బి. లక్ష్మి,ఎంవీ రామకృష్ణ,డాక్టర్ ఎస్. సత్యనారాయణ,ఎం. గోవిదంరావు,డాక్టర్ ఎల్. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రంగనాథం

ముగిసిన హిందీ పక్షోత్సవాలు

గోపాలపట్నం: హిందీ భాష వ్యాప్తికి కృషి చేయాలని ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. హిందీ పక్షోత్సవాల ముంగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజభాషగా ఉన్న హిందీని మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. 15 రోజులుగా హిందీ భాషపై వ్యాసరచన, కథా రచన, నోట్, డ్రాఫ్టింగ్, అనువాదం, పద్యపఠనం, వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఎన్ఎస్టీఎల్ అంతర్గత మంథన్ 8వ ఎడిషన్‌ను విడుదల చేశారు. హిందీ, హిందీ భాషేతర విభాగాల్లో 150 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందించారు. హిందీ పక్షోత్సవాల చైర్మన్, శాస్త్రవేత్త డాక్టర్ పీకే పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన హిందీ అధికారి వివేక్ శర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.



పత్రిక ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

ఎన్టీపీసీలో భద్రతకు పెద్దపీట

పరవాడ: భద్రతా లక్ష్యాలను సాధించడంతో పాటు కార్యాలయ భద్రత ప్రాముఖ్యత పెంపొందించడానికి సేఫ్టీ పెప్-టాక్ అనేక విధాలుగా దోహదపడుతుందని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా అన్నారు. ఎన్టీపీసీ భద్రతా విభాగం సమన్వయంతో శుక్రవారం సామూహిక భద్రత పెప్ టాక్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ ఎన్టీపీసీలో భద్రత ప్రమాణాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. హెచ్‌వోపీ, సింహాద్రి ఎన్టీపీసీ భద్రత విభాగంలోని ఆరు సూత్రాలను వివరించారు. హెచ్‌వోపీ ద్వారా పలువురు కార్మికులకు ప్రాజెక్టు హెడ్ సిన్హా బెస్ట్ సేఫ్టీ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కార్మికుడికి బహుమతి అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

బౌద్ధాలయాల అభివృద్ధికి చేయూత అవసరం

కంచరపాలెం: రాష్ట్రంలోని బౌద్ధాలయాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని భారత బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కోరారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ నేతృత్వంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన బౌద్ధ సొసైటీ సభ్యులను కేంద్ర సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విశాఖలోని బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. బౌద్ధ క్షేత్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు బౌద్ధ సమాజ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అశోక్‌నగర్ బౌద్ధాలయంలో సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

కార్యక్రమంలో వేణుగోపాల్ గౌతమ్, ఫ్రెడ్డీ, సూరిబాబు, సిహెచ్.బాబూరావు, బౌద్ధ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, సభ్యులను సత్కరిస్తున్న బౌద్ధాలయ సభ్యులు

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7-23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. చోరీ అయిన వాటిలో బంధువుల ఆభరణాలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు